క్లుప్తంగా

300 మందికి వైద్యపరీక్షలు



మందులు పంపిణీ చేస్తున్న విప్పర్తి నిఖిల్

కడియం: మండలంలోని పొట్టిలంకలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. రియా డయాబెటిక్ కేర్ వైద్యులు మెట్ల చందన ప్రియ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 300 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విప్పర్తి నిఖిల్, కొత్తపల్లి వేంకటేశ్వరరావు, భీమిరెడ్డి నాగేంద్ర పాల్గొన్నారు.

బళ్లా సత్యవతికి అభినందనలు



సత్యవతిని సత్కరిస్తున్న సంఘ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: వైస్సార్ సీపీ మూడో డివిజన్ ఇన్‌చార్జిగా నియమితులైన మాజీ కార్పొరేటర్ బళ్లా సత్యవతి, శ్రీనివాసరావు దంపతులను రాజేంద్రనగర్ దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు సత్కరించారు. సంఘ కార్యాలయంలో ఆదివారం నెలవారీ కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. మహాశివరాత్రి రోజు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలపై చర్చించి తీర్మానం చేశారు. సంఘ కార్యదర్శి అల్లంకి మణికంఠ, కోశాధికారి కొడమటి బవ్రాజు, గౌరవ సలహాదారు బత్తుల గణేష్, రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో సమస్యల తాండవం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ధవళేశ్వరం: మేజర్ పంచాయతీ ధవళేశ్వరంలో సమస్యలు తాండవిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. ఆ గ్రామంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సీపీఎం గ్రామ విస్తృత సమావేశం కర్రి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ ధవళేశ్వరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే మాదక ద్రవ్యాలకు కేంద్రంగా మారిపోయి ప్రజలకు రక్షణ లేనటువంటి పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నగర కార్యదర్శి బి.పవన్, ఎస్ఎస్ మూర్తి, టి.సావిత్రి, పడాల రామకృష్ణ, ప్యారీలింగం, ఉమా మహేశ్వర రావు, ఆనంద్ పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో అన్ని శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు నరసింహారావు, జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు డిమాండ్ చేశారు. ఆదివారం రైల్వేస్టేషన్ వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రైల్వేస్టేషన్‌లో బాక్స్‌బాయ్‌లుగా 25 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, మహిళలకు మెటర్నిటీ లీవులు కల్పించాలని డిమాండ్ చేశారు.

నేడు 'స్పందన'

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం యథాతథంగా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలన్నారు. అలాగే డయల్ యువర్ కమిషనర్, ఫేస్‌బుక్ లైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

మందుల వితరణ

రాజమహేంద్రవరం సిటీ: అనారోగ్యంతో బాధపడుతున్న 31వ డివిజన్ మదన్ సింగ్ పేటకు చెందిన సీనియర్ కార్యకర్త అరుంధతికి తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరఫున మందులు అందజేశారు. ఆమె కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో ఈ మందులు అందించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

సంత్ రవిదాస్ జయంతి

ధవళేశ్వరం: బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం సంత్ రవిదాస్ జయంత్యుత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకట్రావు మాట్లాడుతూ సంత్ రవిదాస్ కాశీలో దళిత చర్మకారుల కుటుంబంలో జన్మించారన్నారు. రామ నామం మన ముక్తికి మార్గమని, రాముడు మనకు ఆదర్శమని, రాముని చరిత్రను వాడవాడలా తెలిపేవారన్నారు. 16వ శతాబ్దంలో మతమార్పిడిలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం నింపేవారన్నారు. అనంతరం లంక బుజ్జి, స్వామి అనంతపద్మనాభంకు శాలువ కప్పి సన్మానించారు.

ఆసక్తికరంగా.. ఆకట్టుకునేలా..

- సర్కారు బడుల్లో ఇంగ్లిష్ ల్యాబ్‌లు
- శ్రద్ధగా పాఠాలు వింటున్న విద్యార్థులు

కంబాలచెరువు: ఆంగ్ల బోధన అందుబాటులోకి వచ్చింది. సర్కారు బడుల్లోనూ ఆసక్తికరంగా సాగుతోంది.. ఒకప్పుడు ఇంగ్లిషు ల్యాబ్‌లు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలోనే ఉండేవి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానంతో సర్కారు బడుల్లోనూ పేద విద్యార్థులు ఇంగ్లిషు ల్యాబ్‌ల్లో విద్యాభ్యాసం సాగిస్తున్నారు. విద్యా వ్యవస్థకు చక్కని బాట వేస్తున్న ప్రభుత్వం నాడు– నేడుతో స్కూళ్ల రూపురేఖలు మార్చింది. కార్పొరేట్‌ను తలదన్నేలా సకల సౌకర్యాలతో సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్ రూమ్‌లు అందుబాటులోకి రావడంతో అక్కడే తరగతులు బోధిస్తున్నారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు ఇంగ్లిషు ల్యాబ్, డిజిటల్ క్లాస్ రూముల్లో పాఠాలు బోధిస్తున్నారు. అర్బన్ పరిధిలో ఎలిమెంటరీ 50, యూపీ స్కూల్స్ 3, హైస్కూల్స్ 13, రాజమహేంద్రవరం రూరల్ ప్రాంతంలో 60 స్కూల్స్ ఉన్నాయి. వీటిలో 106 పైగా ఎల్ఈడీ ప్రొజెక్టర్లు అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిని తరగతి గదుల్లో అమర్చి పాఠాలను బోధిస్తున్నారు. ముందుగానే అర్బన్, రూరల్ పరిధిలోని అన్ని మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు డిజిటల్ పాఠాల బోధనపై శిక్షణ ఇచ్చారు. వాటిని ఏవిధంగా బోధించాలి, ఎలా ఉపయోగించాలనే దానిపై మెళకువలను నేర్పారు. రోజూ స్కూల్‌లో రెండు పిరియడ్లను ఏర్పాటు చేశారు. దీనిలో తప్పనిసరిగా ఒక గంట ఆయా సబ్జెక్టును ఉపాధ్యాయులు డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా బోధించాలి. విద్యార్థులు కూడా సాధారణ పాఠాల కన్నా డిజిటల్ క్లాస్ రూమ్ ద్వారా చెబుతున్న పాఠాలకే ఆసక్తి చూపుతున్నారు. నోటితో చెప్పే పాఠాల కన్నా ప్రొజెక్టర్‌ల ద్వారా బోధించడంతో ఆసక్తికరంగా వింటున్నారు. అభ్యాస ఆండ్రాయిడ్ యాప్ ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రతి పాఠ్య పుస్తకంలో క్యూఆర్ కోడ్ ఉంటుంది. దీనిని ఇంటర్నెట్ ఉపయోగించి స్కాన్ చేస్తే ఆ పుస్తకంలో పాఠాలన్నీ తెరపై ప్రత్యక్షమవుతాయి. ఇంటర్నెట్ సౌకర్యం లేని స్కూళ్లకు పెన్‌డ్రైవ్, సెల్‌ఫోన్‌ల ద్వారా ఎల్ఈడీ ప్రొజెక్టర్లకు కనెక్ట్ చేసుకుని డిజిటల్ పాఠాలను బోధిస్తున్నారు. ఈ విధానం చాలా ఉపయోగకరంగా ఉంది. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు ఇంగ్లిషు ల్యాబ్, ఏడు, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు డిజిటల్ క్లాస్ రూమ్స్ ద్వారా విద్యా బోధన చేస్తుండగా ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ట్యాబ్‌ల ద్వారా బైజూస్ పాఠాలను అందిస్తున్నారు.



ఓ స్కూల్‌లో డిజిటల్ తరగతి గది

చదువుపై ఆసక్తి పెరుగుతోంది



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంచి విద్యా బోధన అందుతోంది. ఇంగ్లిషు ల్యాబ్‌లో పాఠాలు వీడియో ద్వారా చెబుతుంటే విద్యార్థులు చక్కగా వింటున్నారు. దీనివల్ల పిల్లల్లో చదువుకోవాలనే ఉత్సాహం మరింత పెరుగుతుంది. ప్రతి స్కూల్‌లో ఒకటి, రెండు పిరియడ్లను కేటాయించి డిజిటల్ తరగతిలో పాఠాలు బోధించాలి. దీనిపై నిత్య పర్యవేక్షణ చేస్తున్నాం.

–బి.దిలీప్‌కుమార్, అర్బన్ డీఐ, రాజమహేంద్రవరం

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రకాశం నగర్: వాసవీ సీనియర్ సిటిజన్స్ క్లబ్ నూతన ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక వైశ్యా హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా మండవల్లి మురళీకృష్ణ, కార్యదర్శిగా బూరాడ మురళీ, కోశాధికారిగా వీఎస్ నారాయణ నియమితులయ్యారు. కార్యక్రమానికి ఎం.రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పది మంది వృద్ధులకు పింఛన్లు, ఇద్దరు విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

రాజమహేంద్రవరం రూరల్: కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఏలూరు జిల్లా పోలవరానికి చెందిన కె.జగన్మోహనరావు తన తండ్రి వెంకటేశ్వరరావును రాజానగరంలోని జీఎస్ఎల్ ఆసుపత్రికి శనివారం తీసుకువచ్చారు. అనంతరం బంధువులు ఇంటికి బయలుదేరగా మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో దివాన్ చెరువు పండ్ల మార్కెట్ వద్ద వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో జగన్మోహనరావు, వెంకటేశ్వరరావుకు తీవ్రగాయాలు అయ్యాయి. వారిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జగన్మోహనరావు ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై జగన్మోహనరావు ఆదివారం కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో చక్రస్నానం

కడియం: దుళ్లలోని భూసమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం జరిగిన చక్రస్నానానికి భక్తులు పోటెత్తారు. ఐదురోజులుగా నిత్య పూజలు, హోమాలు, అభిషేకాలతో పాటు స్వామివారి వాహన సేవలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం సుప్రభాతసేవ అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. చక్రస్వామికి పంచామృతాభిషేకాలు జరిపారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జల్లు స్నానఘట్టంపై చక్రస్నానానికి ఏర్పాట్లు చేశారు. దుళ్లతో పాటు కొత్తపేట, ఆలమూరు, మండపేట రూరల్ మండల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు పర్యవేక్షణలో వేదపండితులు పూజలు చేశారు. రాత్రికి స్వామివారికి వివిధ రకాల పువ్వులతో శ్రీపుష్పయాగం జరిగింది. విభిన్న రకాల స్వీట్లను స్వామికి నివేదనగా భక్తులు అందజేశారు. అలాగే మంగళవారం అన్నదానం జరుగుతుందని ఆలయ అనువంశిక ధర్మకర్త శ్రీనివాసరావు, ఆలయ భక్తబృందం తెలిపింది.



చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం

రక్తదాన శిబిరం

ప్రకాశం నగర్: మన బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రి సంజీవని వలంటరీ బ్లడ్ సెంటర్‌లో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సంస్థ నిర్వాహకుడు గారా అజయ్ కుమార్ రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

కలెక్టరేట్ వద్ద సంకల్ప దీక్ష

కంబాలచెరువు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆదివారం సంకల్ప దీక్ష నిర్వహించారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ గన్నవరం వద్ద యూటీఎఫ్ చేపట్టిన సంకల్ప దీక్షకు ప్రభుత్వం అక్రమ నిర్బంధాలు, అరెస్టులు చేసిందని, దీనిని తాము వ్యతిరేకిస్తూ, నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర కార్యదర్శి అరుణ కుమారి ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు జయకర్, ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్, ఎల్ఐసీ సంఘ నాయకులు సతీష్, సీఐటీయూ నాయకులు అరుణ్ కుమార్, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు శంకరుడు పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ పంపిణీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇన్నీసుపేటకు చెందిన తలసేమియా వ్యాధితో బాధపడుతున్న కారపురెడ్డి రోహంత్‌కు డీఎంఅండ్‌హెచ్‌వో పింఛన్ ఈ నెల కొత్తగా మంజూరైంది. అయితే రోహంత్‌కు ఎంపీ మార్గాని భరత్‌రామ్ సహాయంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా హైదరాబాద్ సిటిజన్స్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శస్త్రచికిత్స జరిగింది. దీంతో నగరపాలకసంస్థ 27వ డివిజన్ 38వ వార్డు సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ కోట్ల రంజిత్ కుమార్ స్వయంగా హైదరాబాద్ వెళ్లి పింఛన్ రూ.10 వేలను అందించారు. నగరపాలకసంస్థ పరిధి 79వ వార్డు సచివాలయంలోని మహేంద్రవాడ సరోజిని హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం వెళ్లారు. ఆమె రెండు నెలలుగా పింఛన్ తీసుకోలేదు. మూడో నెల తీసుకోకపోతే రద్దవుతుందని తెలిసి సచివాలయ కార్యదర్శి కాశేశ్వరరావు స్వయంగా హైదరాబాద్ వెళ్లి మూడునెలల పింఛన్ అందించారు.



రోహంత్‌కు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ రంజిత్ కుమార్

మల్లయ్యపేట మెడికల్ కార్యవర్గం ఎంపిక

రాజమహేంద్రవరం రూరల్: ది మల్లయ్యపేట మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక మెహర్ మెడికల్ షాపు భవనంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో హోల్‌సేల్ మెడికల్ అసోసియేషన్ జిల్లా నాయకుడు ఆర్.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎలక్షన్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా వీవీవీ రమణ, కార్యదర్శిగా పీవీ వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఏ.చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా ప్రయాగ శ్రీనివాసు (బాబాయి)ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సభ్యులందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి డాక్టర్ల చీటీలపై మందులు విక్రయించాలన్నారు. త్వరలో జరిగే జిల్లా స్థాయి అసోసియేషన్ ఎన్నికలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ ఔషధ నియంత్రణ శాఖ అధికారుల ఆదేశాలను అనుసరిస్తూ ముందుకు సాగాలన్నారు. మల్లయ్య పేటకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా అసోసియేషన్ తరఫున పెద్దలతోనూ, అధికారులతోనూ చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



కార్యవర్గాన్ని అభినందిస్తున్న జిల్లా నాయకుడు శ్రీనివాసరావు

మెయిన్ రోడ్డులో అభివృద్ధి పనులు

రాజమహేంద్రవరం సిటీ: ఎంపీ భరత్ రామ్ ఆదేశాలతో మెయిన్ రోడ్డు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విజయా టాకీస్ నుంచి కోటగుమ్మం వరకూ గల 1.25 కిలోమీటర్ల రహదారి పూర్తిగా గోతులమయంగా మారి ద్విచక్ర వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో తక్షణ చర్యలు చేపట్టేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వ్యాపారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ఈ మెయిన్ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అభ్యర్థించడంతో ఈ చర్యలు చేపట్టారు. ఎంపీ స్వయంగా రెండుసార్లు పరిశీలించిన అనంతరం ఆధునీకరణకు సిద్ధమయ్యారు. విజయాటాకీస్ నుంచి టౌన్ హాల్ వరకూ గల రోడ్డుపై మొదట ప్యాచ్‌వర్క్ పూర్తి చేయడం, అలాగే టౌన్ హాల్ సెంటర్ నుంచి కోటగుమ్మం వరకూ రోడ్డు వేయడానికి మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. ఈ అభివృద్ధి పనులకు నగర పాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ.68 లక్షలు, అలాగే విద్యుత్ పనులకు రూ.44 లక్షలు మొత్తం రూ.1.12 కోట్లు వెచ్చిస్తున్నారు. దీనిపై ఎస్ఈ పాండురంగారావు మాట్లాడుతూ రహదారి ప్యాచ్‌వర్క్ పనులు రెండు మూడు రోజుల్లో పూర్తి చేస్తామని, తారురోడ్డు నిర్మాణ పనులైతే పది రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. విద్యుత్ పనులకు రెండు నెలల సమయం పడుతుందన్నారు.



మెయిన్ రోడ్డులో జరుగుతున్న పనులు

పూర్వ విద్యార్థుల కలయిక



కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

కడియం: స్థానిక ఏవీఆర్ జూనియర్ కాలేజీలో 1996 –98లో ఇంటర్మీడియెట్ చదువుకున్న విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. కడియపులంకలోని విశ్వేశ్వర హైటెక్ నర్సరీలో గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తమ అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా సందడి చేశారు.

పింఛన్ల పంపిణీ

ప్రకాశం నగర్: వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్‌కేవీటీ కళాశాల ఆనంద గార్డెన్స్‌లో వృద్ధులకు పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. యోగా గురువు బాబాజీ, వాకర్ సూరపు రెడ్డి తాతారావు, గుబ్బల గంగాభవాని చేతుల మీదుగా 80 మంది వృద్ధులకు రూ.400 చొప్పున, ఇద్దరు విద్యార్థులకు రూ.7 వేలు అందజేశారు. వాకర్ యేరుకొండ రాధాకుమారి విద్యార్థి ఎస్.శ్రీనివాసరావుకు 5 వేలు అందించారు.

అమ్మవారికి వైభవంగా కుంకుమపూజలు



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ: మాఘమాస దీక్షగా తలపెట్టిన హోమశతచండీ సహిత సౌరయాగంలో ఆదివారం మాఘపౌర్ణమి పుష్యమి నక్షత్రం సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. సీతంపేటలో వడలి కుమార్ శర్మ ఆధ్వర్యాన 36 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో సూర్యభగవానునికి హోమాలు, అమ్మవారికి విశేష సామూహిక సువాసిని కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి శ్రీచక్రనవావరణార్చన చేశారు. సంతాన భాగ్యం కోసం ఈనెల 11న పుత్ర కామేష్టి యాగం, అష్ట ఐశ్వర్య ఆరోగ్య సిద్ధి కోసం ఈ నెల 22, 23, 24 తేదీల్లో మహాలక్ష్మి హోమం జరుగుతాయని వడలి కుమార్ శర్మ తెలిపారు.

ఏసీ రిపేరు పేరుతో మోసం

కంబాలచెరువు: ఏసీ రిపేరు చేయించుకునేందుకు ఆన్‌లైన్లో సంప్రదిస్తే రూ.1.15 లక్షలు మాయమయ్యాయి. ఈ మేరకు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. మల్లయ్యపేట చెందిన సుంకర రామతులసీరావు ఇంటిలో ఏసీ పాడైంది. దీన్ని రిపేరు చేయించుకునేందుకు ఆన్‌లైన్‌లో వెతికాడు. డయాన్ ఏసీ సర్వీసింగ్ పేరు కనిపిండంతో దాన్ని క్లిక్ చేశాడు. దానిలో పూర్తి వివరాలు ఇవ్వాలని చెప్పడంతో అవి పూర్తి చేశాడు. తర్వాత ఒక లింక్ వచ్చింది. దానికి రూ.రెండు పంపాలని కోరగా, అలాగే చేశాడు. వెంటనే అతడి బ్యాంకు ఖాతాలోని రూ.1.15 లక్షలు మాయమయ్యాయి. దీంతో పోలీసులను ఆశ్రయించాడు.

సూత్రధారి సేల్స్‌మెన్

- ప్రభుత్వ మద్యం దుకాణంలో అక్రమ అమ్మకాలు
- ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

అనపర్తి: ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా నిర్వహిస్తున్న మద్యం అమ్మకాల్లో అక్రమాలకు పాల్పడుతున్న సేల్స్‌మెన్, సంబంధిత వ్యక్తులను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కుతుకులూరు ప్రభుత్వ మద్యం దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్న ఓ వ్యక్తి మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన మల్లిడి గంగిరెడ్డి అనే వ్యక్తికి మద్యం బాటిల్‌కు రూ.5 చొప్పున అధికంగా వసూలు చేసి నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన కొందరు అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న గంగిరెడ్డిని ఆదివారం అడ్డగించి నిలదీయడంతో తప్పు ఒప్పుకున్నాడు. స్థానికులు ఈ విషయాన్ని వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంతో పాటు విషయాన్ని రంగంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రంగంపేట సీఐ వి.వెంకటలక్ష్మి, ఎస్ఐ శేఖర్‌బాబులు కుతుకులూరు చేరుకుని ప్రభుత్వ మద్యం షాపులో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న పి.వరప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అతడిచ్చిన సమాచారం మేరకు గంగిరెడ్డిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుండి 127 మద్యం బాటిళ్లు, రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన ఎ.వీరభద్రరావు నుంచి 32 మద్యం బాటిళ్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

పేకాట శిబిరాలపై దాడి

బిక్కవోలు: పందలపాకలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. కెల్ల అయ్యప్ప స్వామి, రొంగల వెంకట అనిల్ కుమార్, షేక్ కన్నా సాహెబ్, కాకరపర్తి శ్రీను, షేక్ మహ్మద్, షేక్ భాషా, కె.శ్రీనివాస్‌లను అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.45,160 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

అనపర్తి: స్థానిక పాతవూరులోని లక్ష్మీదేవి చెరువు సమీపంలో పేకాడుతున్న పది మందిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ పి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీదేవి చెరువు సమీపంలోని ఓ షెడ్డులో కొందరు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న పది మందిని అరెస్ట్ చేసి రూ.9,815 నగదును స్వాధీనం చేసుకున్నారు.

అలరించిన సంగీత, నృత్య సభ



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారులు

రాజమహేంద్రవరం సిటీ: సద్గురు సన్నిధి స్వచ్ఛంద సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక త్యాగరాజ నారాయణ దాస సేవాసమితి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన 125వ నెలవారీ శాస్త్రీయ సంగీత, నృత్య సభ ఆహూతులను అలరించింది. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో సాహితీవేత్తలు తరలివచ్చారు. శిష్ట్ల మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

అనపర్తి: స్థానిక శేషగిరిరావుపేటలోని సాయిరాం మందిరం 21వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జి.ఈశ్వరశర్మ ఆధ్వర్యంలో బాబాకి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో కొలువుదీరిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్లను వివిధ రకాల పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు.